## డెంగ్యూతో చిన్నారి మృతి


రుషిత (ఫైల్)

హుజూరాబాద్, సెప్టెంబర్ 30 : డెంగ్యూతో పదేండ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో సోమవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన రావుల వెంకటేశ్వర్లు, రజని దంపతులకు కొడుకు, కూతురు రుషిత(10) ఉన్నారు. రుషితకు వారం రోజుల క్రితం జ్వరం రాగా స్థానిక వైద్యులకు చూపించారు. జ్వరం తగ్గకపోవడంతో రెండ్రోజుల క్రితం మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేసి డెంగ్యూ అని నిర్ధారించారు. వైద్యం చేస్తుండగానే రక్తకణాలు పూర్తిగా పడిపోవడంతో బాలిక మృతిచెందింది. అల్లారు ముద్దుగా చూసుకుంటున్న కూతురు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. రిషిత గ్రీన్ సెడ్జ్ (వీపీఎస్) స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్నది.

## స్కూల్ బస్సు ఢీకొని చిన్నారి దుర్మరణం


మనోజ్ఞ (ఫైల్)

ముస్తాబాద్, సెప్టెంబర్ 30 : స్కూల్లో ముందస్తు బతుకమ్మ వేడుకల కోసం కొత్త దుస్తులు ధరించి సంతోషంగా వెళ్లిన చిన్నారి అదే స్కూల్ బస్సు కిందపడి ప్రాణాలు విడిచింది. ఈ విషాదకర ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో సోమవారం జరిగింది. ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన భూమ రాజు – వెంకటలక్ష్మి దంపతులకు కూతురు మనోజ్ఞ (5) ముస్తాబాద్‌లోని మహర్షి స్కూల్లో నర్సరీ చదువుతున్నది. సోమవారం బస్సులో స్కూల్‌కు వెళ్లింది. బస్సు దిగి వెనుక నుంచి వెళుతున్న క్రమంలో డ్రైవర్ చూడకుండా రివర్స్ తీయడంతో చిన్నారి వెనుక టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ, డీవైఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాఠశాల ఎదుట ధర్నాకు దిగారు.


సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, గంగుల, ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు

# కాంగ్రెస్‌కు మూసీ బ్యాంకు

- 2400 కి.మీ. 'నమామి గంగ'కు 40 వేల కోట్లు
- 55 కిలోమీటర్ల మూసీకి 1.50 లక్షల కోట్లా?
- మూసీ బాధితుల పాలిట కాలయముడిలా రేవంత్
- రెడ్‌లైన్లు వేసుడు కాదు.. డెడ్‌లైన్లు పెడుతం
- ఢిల్లీ పార్టీలను గెలిపిస్తే గల్లీ ప్రజలకు ఆక్రందనలే
- బుల్డోజర్‌కు అడ్డుగా నిలుస్తాం: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్ చెప్తున్న మూసీ సుందరీకరణ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వచ్చే సాధారణ ఎన్నికల కోసం ఈ ప్రాజెక్టు కాంగ్రెస్‌కు రిజర్వ్ బ్యాంకులా, ఏటీఎంలా ఉపయోగపడుతుందని దుయ్యబట్టారు. మూసీ ప్రాజెక్టును ఎవరి కోసం చేపడుతున్నారో చెప్పాలని, అసలు కాంగ్రెస్ సర్కార్ ప్రాధాన్యాలు ఏమిటో చెప్పాలని నిలదీశారు. 300 రోజులైనా కాంగ్రెస్ హామీలు అమలు కావడంలేదని, ఇచ్చిన హామీలను పక్కనపెట్టి ప్రజలకు అక్కరకు రాని అంశంపై లక్షన్నరకోట్లు ఖర్చు పెట్టడం ఎవరికోసమని ప్రశ్నించారు. పేదల పక్షాన హైకోర్టుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'రెండు వేల పింఛన్ నాలుగు వేలవుతుందని, రెండు లక్షల రుణమాఫీ అని, తులం బంగారంతో కల్యాణలక్ష్మిని అమలు చేస్తామని, 10వేల నుంచి 15 వేలకు రైతుబంధు పెంచుతామని, ఆటో డ్రైవర్లకు నెలకు వెయ్యి, మహిళలకు రూ.2500 ఇస్తామని చెప్పారు.. వీటికి మాత్రం పైసల్లేవు, చేతులు రావు.. ఇవన్నీ ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత ఇవ్వకుండా అక్కరకు రాని, అక్కరలేని, ప్రజలు కోరుకోని సుందరీకరణ కోసం, ఏ ప్రాధాన్యం లేకుండా రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు పెడుతామంటే ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇందులో ఏం ఆశించి చేస్తున్నారో చెప్పాలి' అని నిలదీశారు. ఓవైపు ఖజానాలో పైసల్లేవంటూనే అప్పుల కోసం అప్పులు తేవాల్సి వస్తున్నదని ఉప ముఖ్యమంత్రి చెప్తున్నాడని, ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. '25వేల కుటుంబాలు, లక్ష మందిని నిరాశ్రయులను చేసేందుకు మూసీ బాధితుల పాలిట ముఖ్యమంత్రి కాలయముడిలా మారాడు' అని మండిపడ్డారు. నేరం చేసిందెవరు? శిక్ష ఎవరికి వేస్తున్నారు? అని ప్రశ్నించారు. 1994లో కాంగ్రెస్ సర్కార్ ఉన్నప్పుడే పట్టాలిచ్చారని, రిజిస్ట్రేషన్లు అయ్యాయని, అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నామని, రిజిస్ట్రేషన్లు చేసుకున్నప్పుడు, నిర్మాణాలకు అనుమతులిచ్చినప్పుడు, ఇంటి పన్ను కట్టించుకున్నప్పుడు, కరెంటు కనెక్షన్ ఇచ్చినప్పుడు, మంచి నీళ్ల బిల్లు కట్టుమన్నప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడే ఎందుకు వస్తున్నాయని బాధితులు అడుగుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం వద్ద సమాధానం ఉన్నదా? అని నిలదీశారు.

### మొదట వారిపై చర్యలు తీసుకోండి

ప్రభుత్వానికి దమ్ముంటే, చేతనైతే వీటికి అనుమతినిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. హైకోర్టు కూడా ఇదే చెప్పిందని గుర్తుచేశారు. 'కూల్చాల్సి వస్తే మొదట కూల్చాల్సింది హైడ్రా కమిషనర్ ఆఫీస్, ఆ తర్వాత జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం.. ఈ రెండూ నాలా మీద కట్టారు' అని తెలిపారు.

### రాహుల్, ప్రియాంక ఎక్కడ?

మూసీ బాధితులు ఆక్రందనలు చేస్తుంటే కాంగ్రెస్ అధినాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఎక్కడ? అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికలప్పుడు అశోక్‌నగర్‌లో చాయ్ తాగి, బిర్యానీ తిని ఓట్లు దండుకున్నారని దుయ్యబట్టారు. వారిప్పుడు ఏమయ్యారని నిలదీశారు. ఢిల్లీ పార్టీలను ఎప్పుడు గెలిపించినా గల్లీ ప్రజల ఆక్రందనలు ఇలానే ఉంటాయని ఉదహరించారు. 'మూసీ ప్రాజెక్టు వల్ల మురిసేది ఎంత మంది?, రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్ ఎంత?, మూసీ వల్ల ఒక్క ఎకరానికైనా సాగు నీరు వస్తుందా?, ఒక్క రైతుకైనా అదనంగా నీరందుతుందా? ఒక్క రిజర్వాయర్ అయినా వస్తుందా?.. ఏమీ లేకున్నా లక్షన్నర కోట్లు అంటే స్కాం కాదా' అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ కాళేశ్వరం బీఆర్ఎస్‌కు ఏటీఎం అన్నారని, మరీ మూసీ ప్రాజెక్టు కాంగ్రెస్‌కు ఏటీఎం కాదా? అని నిలదీశారు. ఇది దేశంలోనే అతి పెద్ద కుంభకోణం కాదా? అని ప్రశ్నించారు.

### వాటికే అంతయితే..

నమామి గంగే ప్రాజెక్టుకు రూ.40వేల కోట్లు, సబర్మతి రివర్ ఫ్రంట్‌కు రూ.7,050 కోట్లు, యమున రివర్ ప్రాజెక్టుకు రూ.1000 కోట్లు ఖర్చయితే మూసీకి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చట? అని కేటీఆర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. థేమ్స్ నది ప్రాజెక్టుకు రూ.40వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. 'ఇందిరమ్మ రాజ్యంలో ఇండ్లు కట్టిస్తారని ఓట్లు వేశారు.. పేదల ఇండ్లు కూలగొడుతామని ముందే చెప్పి ఉంటే ఒక్కరంటే ఒక్కరు కూడా కాంగ్రెస్‌కు ఓటు వేస్తుండేనా?' అని ప్రశ్నించారు.

### నీ జాగీరా

'అన్ని అనుమతులు తీసుకొని కట్టుకున్న ప్రజల ఇండ్లను కూలగొడుతామంటే బీఆర్ఎస్ ఉరుకోదు.. వారికి అండగా నిలబడుతాం. బుల్డోజర్లు వస్తే వాటికి ఎదురుగా మేమే నిలబడుతాం' అని కేటీఆర్ ప్రకటించారు. సమావేశంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ రవీందర్ రావు, బీఆర్ఎస్ నేతలు కార్తీక్‌రెడ్డి, తుల ఉమ పాల్గొన్నారు.

### ఇల్లు అనేది ఎమోషన్

'పేద, మధ్య తరగతి వారికి జీవితకాలం చేసిన కష్టానికి ప్రతీరూపం ఇల్లు. ఇల్లు అనేది ఒక ఎమోషన్. ఆ కుటుంబం మొత్తం కలలుగనే ఒక సౌధం, అది నాలుగు ఇటుకలు, రెండు రాళ్లతో కట్టిన కట్టడం కాదు.. ఇల్లు అనేది జ్ఞాపకాల పొదరిల్లు' అని కేటీఆర్ గుర్తుచేశారు. 'ఇండ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామంటే ఎంత బాధ ఉంటదో రేవంత్‌రెడ్డికి తెలియక పోవచ్చు కానీ నాకు తెలుసు. కేసీఆర్ కుటుంబం ఒక్కసారి కాదు.. రెండు సార్లు డిస్‌ప్లేస్ అయింది. నానమ్మకు చెందిన పోసాన్‌పల్లి అప్పర్ మానేరు డ్యాంలో 1940లో మునిగిపోతే చింతమడకకు వచ్చాం. అమ్మమ్మ గ్రామం మిడ్ మానేరులో మునిగిపోయింది. మా జ్ఞాపకాలు, ఇండ్లు అన్నీ అక్కడే పోయాయి' అని గుర్తుచేసుకున్నారు. ఊరు, ఇంటిలో అల్లుకున్న జ్ఞాపకాలు, ఆశలు, ఆకాంక్షల విలువ రేవంత్‌రెడ్డికి తెలియకపోవచ్చునన్నారు. కాంగ్రెస్ వాళ్లు సునీల్ కనుగోలు డైరెక్షన్‌లో 500 మందిని సోషల్ మీడియాలో పెట్టి బాధితులంతా ఆక్రమణదారులని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

### కొనుక్కునే సంస్కృతి మీది..

ఐదు వేలు తీసుకొని మూసీ బాధితులు మాట్లాడుతున్నారంటూ మంత్రి శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రూ.50 కోట్లకు పీసీసీ ప్రెసిడెంట్ పదవి, రూ.500 కోట్లకు సీఎం పదవి అమ్ముకోవడం, మంత్రులు పర్సంటేజీలు పంచుకోవడం లాంటి కాంగ్రెస్ దిక్కుమాలిన అలవాట్లు ప్రజలకు ఉండవని ఎద్దేవా చేశారు. 'ఆత్మగౌరవం మీద కొడితే తెలంగాణ ప్రజలు తిరగబడుతరు.. వాళ్లు తిరగబడితే కాంగ్రెస్ వాళ్లు ఉళ్లలో తిరగలేని పరిస్థితి వస్తుంది' అంటూ హెచ్చరించారు. మంత్రి శ్రీధర్ బాబు మీద కొంత గౌరవం ఉండేదని, ఆయన మాటలతో గౌరవం పోయిందని చెప్పారు.


హనుమకొండ జిల్లా ఐనవోలులోని కేజీబీవీలో కరెంట్ పోవడంతో చీకటిగా మారిన గది

## కలెక్టర్ సాక్షిగా 'కస్తూర్బా'లో కరెంట్ కట్

ఐనవోలు, సెప్టెంబర్ 30: హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం కలెక్టర్ ప్రావీణ్య ఉండగానే విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో కొన్ని క్లాసుల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. కలెక్టరే స్వయంగా ఆదేశించిన 20 నిమిషాల తరువాత విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించడం చర్చనీయాంశంగా మారింది.

## 3న ట్రిపుల్ ఆర్ బాధితుల మహాధర్నా

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 30 (నమస్తేతెలంగాణ) : ట్రిపుల్ ఆర్‌లో అలైన్‌మెంట్‌లో మార్పులు చేర్పులు, నష్టపరిహారం పెంపు తదితర డిమాండ్లతో ట్రిపుల్ ఆర్ బాధితులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. అక్టోబర్ 3న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపట్టనున్నారు. వ్యవసాయ భూములు, ఇండ్లు, ప్లాట్లు, వాణిజ్య భవనాలు, ఇతర ఆస్తులను కోల్పోతున్న బాధితులంతా రైతు ఐక్యవేదికగా ఏర్పడి ఆందోళనకు సన్నద్ధమవుతున్నారు. చౌటుప్పల్, వలిగొండ, సంస్థాన్ నారాయణపురం, భువనగిరి తదితర మండలాల్లోని బాధితులతోపాటు గజ్వేల్, సంగారెడ్డి ప్రాంత నిర్వాసితులు కూడా తరలివచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. మహాధర్నాకు సంబంధించి ఇప్పటికే పోలీసుల నుంచి అనుమతి కూడా పొందినట్టు తెలిసింది. ఈ ధర్నాకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీల రాష్ట్ర ముఖ్యనేతలతోపాటు రైతు సంఘాల నాయకులను ఆహ్వానిస్తున్నారు. సోమవారం విపక్ష పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, కీలక నేతలను కలిసి మహాధర్నాలో పాల్గొనాలని కోరారు. తమకు సంఘీభావంగా తరలివచ్చి అలైన్‌మెంట్లలో మార్పులు చేర్పు లు, పరిహారం విషయంలో మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం వచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. మహాధర్నాకు పెద్దసంఖ్యలో తరలివెళ్లి ధర్నాచౌక్ దద్దరిల్లేలా చేసి ప్రభుత్వం దిగివచ్చేలా చేయడమే తమ లక్ష్యమని రైతు ఐక్య వేదిక ప్రతినిధులు పేర్కొన్నారు.

### • తాగునీటి కోసం గిరిజనుల నిరసన


మూడు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కోయగూడెంలోని పలు కాలనీలవాసులు సోమవారం నిరసన తెలిపారు. నీటి ట్యాంకు ఉన్నా.. పంపులు రాకపోవడంతో చేతి పంపులను ఆశ్రయించాల్సి వస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు. – టేకులపల్లి

## గంజాయి పట్టివేత

భద్రాచలం, సెప్టెంబర్ 30: భద్రాచలంలో ఎక్సైజు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం 130.730 కేజీల గంజాయిని పట్టుకున్నారు. గంజాయి తరలిస్తున్న కారు డ్రైవర్‌ను పట్టుకొని కారును సీజ్ చేసి స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.37.60 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ గంజాయిని ఒడిశా రాష్ట్రం నుంచి ముంబాయికి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఇద్దరిపై కేసు నమోదు చేయగా డ్రైవరు మహ్మద్ షరీఫ్‌ను అరెస్టు చేశాము. గంజాయి తరలిస్తున్న యూసఫ్ నహీద్‌ఖాన్ పరారీలో ఉన్నాడు. గంజాయి పట్టుకున్న వారిలో ఎస్టీఎఫ్ సీఐ సీహెచ్ శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుళ్లు ఖరీం, బాలు ఉన్నారు.

**కూనవరం రోడ్డులో...**

భద్రాచలం, సెప్టెంబరు 30: భద్రాచలంలోని కూనవరం రోడ్డులో చెక్‌పోస్టు వద్ద పోలీసులు సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా సమీపంలో నిలిపి ఉంచిన ఆటోను పరిశీలించగా 50 కేజీల గంజాయి లభ్యమైంది. ఆటోతో పాటు గంజాయిని రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా చేసి స్టేషన్‌కు తరలించారు. గంజాయి తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వీవీఎన్‌రావు తెలిపారు.

## రోల్ ప్లే విజేతగా అన్నపురెడ్డిపల్లి కేజీబీవీ


క్రీడాకారులను అభినందిస్తున్న పీవో రాహుల్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 30: జిల్లా విద్యాశాఖ నిర్వహించిన రోల్ ప్లే పోటీల్లో అన్నపురెడ్డిపల్లి కేజీబీవీ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించింది. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా విద్యాశిక్షణా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులను జిల్లా విద్యాశాఖ అదికారి ఎం.వెంకటేశ్వరాచారి ప్రదానం చేశారు. అన్నపురెడ్డిపల్లి కేజీబీవీ– ప్రథమ, టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల– ద్వితీయ, సులానగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల– తృతీయ బహుమతి సాధించాయి. విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ నాగరాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల రాజశేఖర్‌కు సన్మానం


రాజశేఖర్‌ను సన్మానిస్తున్న డైరెక్టర్

కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 30: సింగరేణి కార్పొరేట్ ఏరియాలోని సెంట్రల్ వర్క్‌షాప్‌లో ఫిట్టర్‌గా పనిచేస్తున్న కొట్టూరునుర్వి రాజశేఖర్.. 2020 జూలై నుంచి ఇప్పటి వరకు రోజుకు ఒకటి చొప్పున 1500కు పైగా మొక్కలు నాటారు. 'మొక్కల రాజశేఖర్'గా పేరు తెచ్చుకున్న ఈయనను ఈ నెల 29న మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ అభినందించారు. ప్రధాని నుంచి అభినందనలు అందుకుని, సింగరేణికి కీర్తి గడించి పెట్టిన రాజశేఖర్‌ను హెడ్డాఫీస్‌లో డైరెక్టర్ (ఈఅండ్ఎం, ఆపరేషన్స్) సత్యనారాయణరావు తన చాంబర్‌లో సోమవారం అభినందించి, శాలువా కప్పి సన్మానించారు.

## వ్యర్థాలతో అందాలు


ప్లాస్టిక్ బాటిల్స్‌తో ఇండియా ఆకృతి

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 30: పర్యావరణానికి హాని కలిగించే వ్యర్థాలతో అందాలను సృష్టించవచ్చని నిరూపించారు మండలంలోని తోగ్గూడెం మహిళలు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎకో బ్రిక్స్(బాటిల్స్)ను వీరు తయారు చేశారు. వీటిని ఇంటి పరిసరాల్లో ఎలా అందంగా అలంకరించవచ్చో చేసి చూపిస్తున్నారు. పంచాయతీల్లో చెత్త సేకరించినప్పుడు


జాతీయ జెండా రూపం

ప్లాస్టిక్/కూల్ డ్రింక్ బాటిల్స్, వివిధ రకాల ప్యాకెట్ కవర్స్ వస్తుంటాయి. వీటిని చెట్లకు/మొక్కలకు, ఇంటి పరిసరాల్లో వివిధ ఆకృతుల్లో అమర్చవచ్చు. మొక్కలు/చెట్ల చుట్టూ చిన్న గోడలా పెట్టుకోవచ్చు. కాంపౌండ్ వాల్ నిర్మాణం మధ్యలో అక్కడకడ.. ఇటుకలకు బదులుగా వీటిని పేర్చుకోవచ్చు. సృజనాత్మకత జోడిస్తే ఎన్నో వ్యర్థాలతో ఎన్నెన్నో అందాలను సృష్టించవచ్చని ఈ మహిళలు నిరూపించారు. ప్లాస్టిక్ బాటిల్స్, పేపర్ ప్యాకెట్లతో జాతీయ జెండా, భారతదేశ పటాలను రూపొందించారు.

## డ్రైవర్‌కు ఫిట్స్.. తప్పిన ముప్పు


విద్యుత్ స్థంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్

అశ్వారావుపేట టౌన్, సెప్టెంబర్ 30: ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్‌కు ఫిట్స్ వచ్చాయి. దీంతో ఆ ట్రాక్టర్ అదుపుతప్పి విద్యుత్ స్థంభాన్ని ఢీకొంది. పెను ముప్పు తప్పింది. స్థానిక చిన్నంశెట్టి బజార్‌కు చెందిన గోదా వెంకయ్య ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వేదాంతపురంలోని రైతు జగదీష్‌కు చెందిన పామాయిల్ తోట నుంచి పామాయిల్ గెలలను ట్రాక్టర్ ద్వారా ఫ్యాక్టరీకి సోమవారం తరలిస్తున్నాడు. పట్టణంలోని దొంతికుంట చెరువు వద్దకు రాగానే డ్రైవర్ వెంకయ్యకు ఒక్కసారిగా కళ్లు తిరిగి, ఫిట్స్ వచ్చాయి. స్టీరింగ్ వదిలేయడంతో ట్రాక్టర్ అదుపు తప్పి, రోడ్డు పక్కకు వెళ్లి, 11 కేవీ విద్యుత్ స్థంభాన్ని ఢీకొంది. డ్రైవర్ వెంకయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో కుటుంబీకులు సత్తుపల్లికి అంబులెన్స్‌లో తీసుకెళ్లారు. విద్యుత్ స్థంభాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతోనే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్థంభం పడిపోయినా, తీగలు తెగినా పెను ముప్పు ఉండేదని స్థానికులు, వెంకయ్య కుటుంబీకులు భయాందోళన వ్యక్తం చేశారు.

## నేటి నుంచి 'డీఎస్సీ' సర్టిఫికెట్ల పరిశీలన

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 30 : డీఎస్సీ–2024 ఫలితాలు సోమవారం ప్రకటించారు. ఖమ్మం జిల్లాలో వివిధ కేటగిరిల్లో ఉన్న 575 ఖాళీలకు జూలై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించారు. సబ్జెక్టుల వారిగా జనరల్ ర్యాంకింగ్స్‌ను ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు 1:3 నిష్పత్తిలో సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నారు. ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయనున్నారు. 1వ తేదీ ఖమ్మం నగరంలోని రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, 2, 3, 4, 5వ తేదీల్లో ఎస్‌జీటీలకు రోటరీనగర్ జడ్పీఎస్ఎస్ పాఠశాలలో, స్కూల్ అసిసెంట్లకు ఇందిరానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వెరిఫికేషన్ జరుగనున్నది. కేటగిరిల వారిగా వెబ్‌సైట్‌లో అభ్యర్థుల జాబితాను పొందుపరిచినట్లు డీఈవో సోమశేఖరశర్మ తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలనకు ఒరిజినల్ ధ్రువపత్రాలతోపాటు రెండు జిరాక్స్ సెట్లను తీసుకురావాలని సూచించారు.

**జిల్లా అబ్జర్వర్‌గా శ్రీనివాసచారి...**

డీఎస్సీ –2024 సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు ప్రభుత్వం ఖమ్మం జిల్లా అబ్జర్వర్‌గా మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసచారిని నియమించింది. ఈయన ఖమ్మం డీఈవోగా పనిచేశారు.

## డిస్పెన్సరీ తనిఖీ

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 30: ఇల్లెందు జేకే కాలనీలోని సింగరేణి డిస్పెన్సరీని జీఎం జాన్ ఆనంద్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ ఎస్‌జీటీలను రిలీవ్ చేయాలి


మాట్లాడుతున్న చావా రవి

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 30: బదిలీ అయిన ఎస్‌జీటీలను రిలీవ్ చేయాలని టీఎస్ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావా రవి కోరారు. ఆయన సోమవారం సింగరేణి పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక టీచర్, ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు టీచర్లు ఉండాలని, ఉపాధ్యాయులు–విద్యార్థులు నిష్పత్తి 1:20గా నిర్ణయించాలని యూటీఎఫ్ డిమాండ్ చేస్తున్నదని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా కార్యదర్శి జయరాజు, మండల అధ్యక్షుడు ఎ,రాంబాబు, నాయకులు లింగానాయక్, కృష్ణవేణి, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

## దంపతుల ఆత్మహత్యాయత్నం

చుంచుపల్లి, సెప్టెంబర్ 30 : ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తికి భారీ మొత్తంలో నగదు ముట్టజెప్పడంతో అతను ఉద్యోగం ఇప్పించకపోగా ఇచ్చిన నగదు తిరిగి ఇవ్వకపోవడంతో మనస్తాపం చెందిన దంపతులు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి యత్నించిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలూరుపాడు మండలం సాయిరాంతండాకు చెందిన హలావత్ రత్నకుమార్, పార్వతి దంపతులు కొత్తగూడెంలోని ఓ షాపింగ్‌మాల్‌లో పనిచేస్తూ చుంచుపల్లిలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో షాపింగ్‌మాల్‌లో రత్నకుమార్‌కు ఓ వ్యక్తి పరిచయం అయ్యాడు. రూ. 16 లక్షలు ఇస్తే సింగరేణి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో రత్నకుమార్ అతను అడిగిన నగదు ముట్టజెప్పాడు. ఎన్ని రోజులైనా ఉద్యోగం రాకపోగా, ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో రత్నకుమార్ దంపతులు పురుగుమందు తాగి తమ్ముడికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబసభ్యులు వారిని వెంటనే ఖమ్మం, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు.

## కోల్పోయిన సర్టిఫికెట్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 30 : వరదల్లో పదో తరగతి సర్టిఫికెట్లు కోల్పోయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించేలా చర్యలు తీసుకునేందుకు నగరంలోని పాత డీఈవో కార్యాలయంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు డీఈవో సోమశేఖరశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు పదో తరగతికి సంబంధించిన పత్రాలు ఏవైనా ఉంటే వాటిని తీసుకుని దరఖాస్తు సమర్పిస్తే వాటి ఆధారంగా రాష్ట్ర కార్యాలయం నుంచి సర్టిఫికెట్లు తెప్పిస్తామని డీఈవో పేర్కొన్నారు.

### గిరిజన దర్బార్‌లో

## ఉద్యోగ దరఖాస్తులు ఇవ్వొద్దు

**భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్**


వినతిపత్రాలు స్వీకరిస్తున్న పీవో

భద్రాచలం, సెప్టెంబర్ 30: ఉద్యోగాలకు సంబంధించిన దరఖాస్తులను గిరిజన దర్బార్‌లో ఇవ్వొవ్వద్దని, జీవనోపాధి, స్వయం ఉపాధి కల్పించేందుకు సంబంధించిన దరఖాస్తులను మాత్రమే ఇవ్వాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ఆదివాసీ గిరిజన గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. అనంతరం పీవో రాహుల్ మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల్లో విద్యుత్తు సౌకర్యం ఏర్పాటుకు, పై చదువులు చదవడానికి ఆర్థిక సహాయం కోసం, ఇతర జీవనోపాధి, వ్యవసాయం, చేపల సొసైటీలు, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యల పరిష్కారంకు దరఖాస్తులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, డీడీ మణెమ్మ, గురుకులం నాగార్జున, ఈఈ తానాజీ పాల్గొన్నారు.

## టెన్నిస్ విజేతలకు బహుమతులు

పాల్వంచ, సెప్టెంబర్ 30: స్థానిక మినీ స్టేడియంలో వారం రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి టెన్నిస్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. విజేతలకు ఐటీడీఏ పీవో రాహుల్ బహుమతులను ప్రదానం చేసి అభినందించారు. టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్‌రెడ్డి, చీఫ్ కోచ్ అన్నం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అశ్వారావుపేట, సెప్టెంబర్ 30 : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సోమవారం రాత్రి దాడి చేసి పట్టుకున్నారు. నారాయణపురం నుంచి అక్రమంగా కొందరు వ్యక్తులు అశ్వారావుపేటకు ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న తహసీల్దార్ పి.కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు గిర్దావర్ కృష్ణ సిబ్బందితో కలిసి అశ్వారావుపేట శివారులో రాత్రి మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. రెవెన్యూ కార్యాలయానికి తరలించారు.

## కుట్టు మిషన్లు ఇవ్వాలని వినతి

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 30: జిల్లాలో నిరుపేద ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు ఇవ్వాలని కోరుతూ 'సేవ్ కొత్తగూడెం–సేవ్ మున్సిపాలిటీ' కన్వీనర్ జలాల్ తదితరులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. మహమూద్, రిజ్వానా, నసీమా, జిలాని, వేణు, మహేష్, పర్వీన్, అఫ్సర్ పాల్గొన్నారు.

## క్వార్టర్స్ కేటాయింపునకు కౌన్సిలింగ్

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 30: సింగరేణి క్వార్టర్ల కేటాయింపై ఎస్‌వోటు జీఎం బొల్లం వెంకటేశ్వర్లు సోమవారం తన కార్యాలయంలో ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు వయోవృద్ధుల దినోత్సవం

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 30 : ఖమ్మం నగరంలోని టీటీడీసీ సమావేశ మందిరంలో మంగళవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కే రాంగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని, వయోవృద్ధుల ఆశ్రమాల నిర్వాహకులు వయోవృద్ధులతో హాజరుకావాలని పేర్కొన్నారు.